క్లుప్తంగా

రేపటి గ్రీవెన్స్‌డే రద్దు

పలమనేరు: ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమంలో భాగంగా సోమవారం పట్టణంలోని ఆర్డీఓ కార్యాలయంలో జరగాల్సిన కలెక్టర్ గ్రీవెన్స్‌డే రద్దు అయ్యిందని పలమనేరు ఆర్డీఓ భవాని శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. తిరిగి ఈ కార్యక్రమం ఎప్పుడు జరిగేది తెలియజేస్తామని ఆమె పేర్కొన్నారు.

తాగునీటి ట్యాంక్ పనులు ప్రారంభం


బొమ్మయ్యగారిపల్లెలో ప్రారంభమైన ట్యాంక్ పనులు

రొంపిచెర్ల: మండలంలో తాగునీటి ట్యాంక్ పనులు ప్రారంభమయ్యాయి. ఎన్నికల అనంతరం తాగునీటి ట్యాంక్ పనులు పుంగనూరు నియోజకవర్గంలోని అన్ని మండలాల్లో ఆగిపోయాయి. దీంతో ప్రజలు తాగునీటి కోసం ఇబ్బందులు పడుతున్నారని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. దీంతో ఆగిపోయిన తాగునీటి ట్యాంక్ పనులను వెంటనే పూర్తి చేయాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. దీంతో కాంట్రాక్టర్‌తో మాట్లాడి పనులను ప్రారంభించారు. రొంపిచెర్ల మండలం బొమ్మయ్యగారిపల్లె పంచాయతీలోని చెన్న కేశవస్వామి ఆలయం ఎదురుగా ఉన్న పెద్ద చెరువులో మంచి నీటి ట్యాంక్ పనులు జరుగుతున్నాయి.

సర్పాల సయ్యాట



పుంగనూరు: పట్టణంలోని ఇందిరా సర్కిల్‌లోని ఏటిగడ్డలో శనివారం రెండు పాములు సయ్యాటలు ఆడాయి. ఆడుతుండగా విద్యార్థి ఎం.అజయ్, మరో విద్యార్థి సెల్‌ఫోన్లలో వీడియోలు, ఫొటోలు తీశారు. పాముల సయ్యాటను అటు వెళుతున్న పలువురు ఆసక్తిగా తిలకించి దృశ్యాన్ని సెల్‌ఫోన్లలో బంధించారు.

వైభవంగా ధ్వజారోహణం


ధ్వజారోహణం నిర్వహిస్తున్న అర్చకులు

పుంగనూరు: పట్టణంలోని హనుమంత రాయుని సన్నిధిలోగల వీరాంజనేయస్వామి ఆలయంలో శనివారం ధ్వజారోహణ కార్యక్రమం నిర్వహించారు. వార్షిక బ్రహ్మోత్సవాల ప్రారంభంలో భాగంగా వేదపండితులు పూజలు, హోమాలు చేసి, ధ్వజారోహణ కార్యక్రమం నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని ఆంజనేయస్వామికి పూజలు చేశారు.

అవార్డు గ్రహీతకు సన్మానం


బాలాజీని సన్మానిస్తున్న జేవీవీ నిర్వాహకులు

పలమనేరు: ఇటీవల కెనడా తెలుగుతల్లి సాహిత్య పురస్కారం, గీతాంజలి స్మారక పురస్కారం అందుకున్న స్థానిక రచయిత పలమనేరు బాలాజీని ఇక్కడి జన విజ్ఞానవేదిక నిర్వాహకులు శనివారం ఘనంగా సన్మానించారు. పలమనేరు పేరును విదేశాల్లో సైతం నిలుపుతున్న ఆయన్ను అభినందించారు. జేవీవీ నేత గిరిధర్‌మూర్తి పాల్గొన్నారు.

పట్టణ కన్వీనర్‌కు సన్మానం


హేమంత్‌కుమార్‌రెడ్డిని అభినందిస్తున్న నేతలు

పలమనేరు: పలమనేరు పట్టణ వైఎస్సార్‌సీపీ కన్వీనర్‌గా నియమితులైన హేమంత్‌కుమార్ రెడ్డిని స్థానిక మైనారిటీ నేతలు శనివారం పార్టీ కార్యాలయంలో సన్మానించారు. పట్టణంలో వైఎస్సార్‌సీపీ బలోపేతం కోసం తాము పార్టీకి అండగా ఉంటామని తెలిపారు. పట్టణానికి చెందిన వైఎస్సార్‌సీపీ కౌన్సిలర్లు, పార్టీ మైనారిటీ నేతలు పాల్గొన్నారు.

మానవహక్కుల జిల్లా యూత్ అధ్యక్షుడి నియామకం


సోమును సన్మానిస్తున్న సభ్యులు

పలమనేరు: మానవహక్కుల సంస్థ జిల్లా యూత్ అధ్యక్షుడిగా సోమును నియమించినట్టు ఆ సంస్థ జిల్లా అధ్యక్షుడు డీవీ మునిరత్నం శనివారం తెలిపారు. ఈ సందర్భంగా వారి కార్యాలయంలో యూత్ అధ్యక్షుడిని ఘనంగా సన్మానించారు. సంస్థ సభ్యులు పాల్గొన్నారు.

లొట్టలేయాల్సిందే!

- జిల్లాలో పెరిగిన మటన్, నాటుకోడి, రాగిముద్ద వినియోగం
- బర్డ్‌ఫ్లూతో తగ్గిన బ్రాయిలర్ చికెన్ అమ్మకాలు
- పొట్టేళ్లను సంతలో కొని గ్రామల్లో అమ్మకాలు
- నాటుకోళ్లకు పెద్దసంత బైరెడ్డిపల్లి
- పెరిగిన మటన్, నాటుకోడి, రాగిముద్ద హోటళ్లు


బైరెడ్డిపల్లి సంతలో నాటుకోళ్ల అమ్మకాలు

పలమనేరు: ఆదివారం వచ్చిందంటేచాలు నాన్‌వెజ్ ఘుమఘుమలాడాల్సిందే. నాటుకోడి, మటన్, రాగిముద్ద చూసి లొట్టలేయాల్సిందే. గత కొన్నాళ్లుగా బ్రాయిలర్ కోళ్లకు రోగాలంటూ చాలామంది వాటి జోలికెళ్లడం లేదు. దీంతో చికెన్‌కు ప్రత్యామ్నాయంగా మటన్, నాటుకోడికి ప్రాధాన్యత పెరిగింది. మటన్‌చారు, నాటుకోడి పులుసు కాంబినేషన్‌గా రాగిముద్ద ఇప్పుడు ట్రెండ్‌గా మారింది. కోవిడ్ నేర్పిన పాఠంతో ప్రజలు ఆరోగ్యంపై దృష్టిని సారించారు. వ్యాధినిరోధకశక్తిని పెంచుకునేందుకు మాంసాహారంపై ప్రజల్లో ఆసక్తి పెరిగింది. రాయలసీమ సంప్రదాయవంటకమైన రాగిముద్దకు నాటుకోడి పలుసు, మటన్ మంచి కాంబినేషన్ కావడంతో లొట్టలేసుకొని రెండు ముద్దలు ఇట్టే లాగించేయొచ్చు. జిల్లాలో మటన్ ధర రూ.850, నాటుకోడి రూ.400 దాటినా జనం కొనేందుకు వెనక్కి తగ్గడం లేదు.

భారీగా మటన్ అమ్మకాలు...

జిల్లాలో రెండు వేల దాకా మటన్ దుకాణాలున్నాయి. దీనికితోడు పల్లెల్లో కొందరు పాటేళ్లు, మేకలను కొని ఆదివారం వాటిని భాగాలుగా వేసి విక్రయాలు సాగిస్తున్నారు. గతంలో కంటే ఈ ఆరు నెలల్లో మటన్ విక్రయాలు రెట్టింపైనట్టు వ్యాపారులు చెబుతున్నారు. మొన్నటి దాకా కిలో మటన్ రూ.600గా ఉండగా ఇప్పుడు రూ.850 దాటింది.

భారీగా వెలిసిన హోటళ్లు..

ఈమధ్య కాలంలో ఉమ్మడి చిత్తూరు జిల్లాతో పాటు కర్ణాటకలోని కోలారు, బెంగళూరుల్లోనూ మటన్, నాటుకోడి చారు, రాగిముద్ద ప్రత్యేక హోటళ్లు, దాబాలు వందలాదిగా వెలిశాయి. ఇక ఆదివారం పూట ఇంటివంట పేరిట ఇళ్లల్లోనే మటన్, నాటుకోడి పులుసు చేసి తోపుడు బండ్లపై, హైవేల్లో సంచార వాహనాల్లోనూ అమ్మకాలు జోరందుకున్నాయి.


మటన్ కర్రీతో రాగిముద్ద


నాటుకోళ్లు, పుంజుల కోసం మూడు రాష్ట్రాల నుంచి...


పలమనేరులో మేలుజాతికి చెందిన పొట్టేలు


కోతకొచ్చిన కోడి పుంజు

పలమనేరు నియోజకవర్గంలోని బైరెడ్డిపల్లిలో ప్రతి శనివారం జరిగే నాటుకోళ్లు, పుంజుల సంతకు ఏపీ నుంచే కాకుండా కర్ణాటక, తమిళనాడు, తెలంగాణ రాష్ట్రాల నుంచి వందలాది మంది వ్యాపారులు వచ్చి కొనుగోలు చేస్తుంటారు. ఇక్కడ లక్షల్లో నాటుకోళ్ల వ్యాపారం జరుగుతుంది.

నాటుకోడిపై పెరిగిన మోజు


నాటుకోడి పులుసు, రాగిముద్ద

గతంలో పల్లెల్లో ప్రతి ఇంట్లో పెరటి నాటుకోళ్లు కచ్చితంగా ఉండేవి. బంధువులు ఇంటికొచ్చినా, పండుగలొచ్చినా కోడికూర వండేవారు. జీవనశైలిలో వచ్చిన మార్పుతో పెరటికోళ్ల పెంపకం తగ్గింది. బ్రాయిలర్ కోళ్ల వినియోగం పెరిగింది. అయితే మళ్లీ జనం నాటుకోళ్లవైపు ఆసక్తిని పెంచుకున్నారు. దీంతో నాటుకోళ్ల పెంపకం పెరిగింది. ప్రస్తుతం జిల్లాలో వందకుపైగా నాటుకోళ్ల పౌల్ట్రీలున్నాయి. సాఫ్ట్‌వేర్‌లు సైతం నాటుకోళ్ల పెంపకం మొదలు పెట్టారు. ఉమ్మడి చిత్తూరు జిల్లాలో బ్రాయిలర్ కోళ్ల అమ్మకాలు గతంలో రోజుకు 30 టన్నులుగా ఉండేవి. కానీ ఇప్పుడు 15 టన్నులకు తగ్గింది. నాటుకోళ్ల అమ్మకాలు 4 టన్నులుగా ఉండేది. ఇప్పుడు 8 టన్నులకు చేరింది. ఇక మటన్ విక్రయాలు సైతం 10 టన్నులకు చేరడం గమనార్హం.

గిరాకీ పెరిగింది..



నేను 20 ఏళ్లుగా నాటుకోళ్ల, పొట్టేళ్ల వ్యాపారం చేస్తున్నా. ఈ మధ్య వీటికి డిమాండ్ బాగా పెరిగింది. బ్రాయిలర్ కోడిమాంసం ధరలు తగ్గాయి. నాటుకోడి, మటన్ ధరలు పెరిగినా వీటినే ఎక్కువగా జనం కొంటున్నారు. మాకు వ్యాపారం బాగానే ఉంది. ఆదివారం, మంగళవారం నాటుకోడి, మటన్ ఉండాల్సిందేనని జనం ఆసక్తి చూపుతున్నారు.

రియాజ్, నంగిళి

ముద్ద దిగాలంటే మటన్ ఉండాల్సిందే..



ఆదివారం రాగిముద్దతో పాటు మటన్‌చారు లేదా నాటుకోడి పులుసు ఉండాల్సిందే. పట్టణ సమీపంలో పలు హోటళ్లలో నాటు పద్ధతిలో రుచికరంగా హోటళ్లు ఉన్నాయి. అక్కడికెళ్లి హాయిగా తిని వస్తుంటా. చాలామంది ఇళ్లకు సైతం రాగిముద్ద, మటన్, చికెన్ కర్రీలను తీసుకెళ్తుంటారు. మనం ఆరోగ్యానికి పెద్దపీట వేయాలికదా కోటి కష్టాలు కడుపు కోసమే అని మన పెద్దోళ్లు ఊరికే అన్నారా.

మల్లి, పలమనేరు

నోటీస్ బోర్డు

- **నేడు సీతారాముల కల్యాణం**

శాంతిపురం: శ్రీరామనవమి సందర్భంగా రాళ్లబూదుగూరు, చౌడంపల్లిలోని కోదండరామ స్వామి ఆలయాల్లో ఆదివారం సీతారాముల కల్యాణం నిర్వహించనున్నారు. రాళ్లబూదుగూరులో ఉదయం 10 గంటల నుంచి, చౌడంపల్లిలో సాయంత్రం 7 గంటల నుంచి స్వామి, అమ్మవార్ల కల్యాణం జరుగుతుందని నిర్వాహకులు తెలిపారు. రాత్రి చౌడంపల్లిలో స్వామి వారి ఉత్సవ మూర్తుల ఊరేగింపు, బాణసంచా వేడుకలు జరగనున్నాయని నిర్వాహకులు పేర్కొన్నారు.

- **ప్రజాసమస్యల పరిష్కార వేదిక రేపు**

కుప్పం: కడా ఆధ్వర్యంలో సోమవారం మండల పరిషత్ కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కార వేదికను నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. నియోజకవర్గ పరిధిలోని సమస్యలపై వినతులు స్వీకరిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని నియోజకవర్గ ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని, కడా పీడీ సమస్యలపై వినతులు స్వీకరిస్తారని తెలిపారు.

ఏడుగురు పేకాటరాయుళ్లు అరెస్ట్

పుంగనూరు: మండలంలోని మాగాండ్లపల్లి సమీపంలో పేకాట ఆడుతున్న ఏడుగురిని పోలీసులు అరెస్ట్ చేశారు. వారి నుంచి రూ.20,300 నగదును స్వాధీనం చేసుకున్నట్లు ఎస్‌ఐ లోకేష్ తెలిపారు. శనివారం రాత్రి ఆయన విలేకరులతో మాట్లాడారు. సీఐ రామ్‌భూపాల్ ఆధ్వర్యంలో వచ్చిన సమాచారం మేరకు దాడులు జరిపి, పేకాట ఆడుతున్న ఏడుగురిని అరెస్ట్ చేశామన్నారు. గ్రామాల్లో పేకాట, కోడిపందేలు నిర్వహించే వారిపై తమకు సమాచారం అందించాలని గ్రామస్తులను ఎస్‌ఐ కోరారు.

భూమి కబ్జా చేశారు

చిత్తూరు రూరల్ (కాణిపాకం): తమ పూర్వీకులకు చెందిన భూములకు అక్రమంగా 1బీ, పట్టాదారు పాస్ పుస్తకాలు సృష్టించి కబ్జా చేశారని పలమనేరు మండలానికి చెందిన హైదర్ వలీ బాషా ఆరోపించారు. చిత్తూరు నగరంలోని ప్రెస్‌క్లబ్‌లో శనివారం విలేకరుల సమావేశం నిర్వహించి ఆయన మాట్లాడారు. పలమనేరు రెవెన్యూ గ్రామంలో ఆరు ఎకరాల భూమి తమ తాత పేరు నుంచి తండ్రి పేరిట రిజిస్ట్రేషన్ అయిన పత్రం ఉందన్నారు. ఈ భూమిలో తాను 2018 వరకు సాగు పనులు చేసుకుంటున్నానని తెలిపారు. అయితే పలమనేరుకు చెందిన కొందరు తప్పుడు వన్‌బీ, పట్టాదారు పాస్ పుస్తకాలు సృష్టించి లేఔట్ వేశారని ఆరోపించారు. అధికారులు స్పందించి న్యాయం చేయాలని కోరారు.

బీమాను సద్వినియోగం చేసుకోండి


చెక్కు అందజేస్తున్న బ్యాంకు అధికారులు

తవణంపల్లె: మండలంలోని సప్తగిరి గ్రామీణ బ్యాంకు ఖాతాదారులు బీమా సౌకర్యాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఎస్‌జీబీ రీజనల్ మేనేజర్ విష్ణుచరణ్ తెలిపారు. అరగొండ సప్తగిరి గ్రామీణ బ్యాంకు ద్వారా ఈచనేరికి చెందిన కుమారి ప్రమాద బీమా పథకం కింద రూ.177 ప్రీమియం చెల్లించింది. గత సంవత్సరం జూన్‌లో ప్రమాదవశాత్తు చెరువులో పడి మృతి చెందింది. మృతురాలు కుమారి కుమార్తె కె.లక్ష్మీ నామినీగా ఉంది. ఈ క్రమంలో శనివారం సాయంత్రం అరగొండ గ్రామీణ బ్యాంకులో రీజనల్ మేనేజర్ విష్ణుచరణ్, మేనేజర్ నవీన్‌కుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో యూనివర్సల్ సొంపు ఇన్సూరెన్స్ కంపెనీ ద్వారా రూ.5 లక్షల చెక్కును నామినీ కె.లక్ష్మీకి అందజేశారు. బ్యాంకు సిబ్బంది, ఖాతాదారులు పాల్గొన్నారు.

వీణ విజయరామరాజు సేవలు అమూల్యం


నివాళులర్పిస్తున్న ఎస్టీయూ నాయకులు

చిత్తూరు కలెక్టరేట్ : ఎస్టీయూ సంఘం ఉద్యమ నాయకుడు వీణ విజయరామరాజు సేవలు అమూల్యమని ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు మదన్‌మోహన్ రెడ్డి కొనియాడారు. జిల్లా కేంద్రంలోని ఆ సంఘ కార్యాలయంలో ఆదివారం వీణ విజయరామరాజు 25వ వర్ధంతి నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఉన్నత విలువలు, అభ్యుదయ భావాలతో ఎన్నో ఉద్యమాల్లో వీణ విజయ రామరాజు పాల్గొన్నారని చెప్పారు. ఎన్నో ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి కృషి చేశారన్నారు. స్వాతంత్ర్యం రాక ముందు స్థాపించిన ఎస్టీయూ సంఘం టీచర్లకు అండగా ఉంటోందన్నారు. అనంతరం ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు గంటామోహన్, నేతలు పురుషోత్తం, దేవరాజురెడ్డి, బిక్కా మురళి, ఢిల్లీ ప్రకాష్, చంద్రన్ పాల్గొన్నారు.

భూతవాహనంపై నీలకంఠుడు

చిత్తూరు రూరల్(కాణిపాకం): చిత్తూరు నగరం ఈశ్వరగుడివీధిలోని శ్రీ అగస్త్యేశ్వరస్వామి ఆలయంలో శనివారం పంగుణి బ్రహ్మోత్సవాలు భక్తిప్రపత్తులతో జరిపించారు. మూలస్థానంలోని స్వామివారికి అభిషేక పూజలతో హారతులు పట్టారు. భక్తులకు దర్శన ప్రాప్తి కల్పించారు. ఉదయం భూతవాహనంపై అంగరంగ వైభవంగా ఊరేగించారు. రాత్రి శేషవాహనంపై ఊరేగిస్తూ భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామికి కర్పూర హారతులు పట్టి తరించారు.

తాగునీటి సమస్యకు పరిష్కారం


బోరుకు మోటారు అమర్చుతున్న దృశ్యం

బైరెడ్డిపల్లె: కూటమి నేతల కక్ష్య సాధింపుల వలన తమ గ్రామంలో తాగునీటి సమస్య ఏర్పడిందని ఈనెల 4న శుక్రవారం మండలంలోని గౌనితిమ్మేపల్లె వాసులు ఆందోళన చేసిన విషయం పత్రికల్లో వెలువడడం విధితమే. దీంతో స్పందించిన కూటమి నేతలు శనివారం ఎట్టకేలకు బోరుకు మోటారు అమర్చి తాగునీటి సమస్యను పరిష్కరించారు. గత కొంత కాలంగా తాగునీటి సమస్యకు తీవ్ర ఇబ్బందులు పడుతుండడంతో సర్పంచ్ చంద్రిక ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేశారు. ప్రస్తుతం నూతనంగా వేసిన బోరులో నీరు పుష్కలంగా ఉండడంతో పాటు మోటారు అమర్చడంతో తాగునీటి సమస్యకు పరిష్కారం అయినట్లేనని గౌనితిమ్మేపల్లె వాసులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

వెండి పళ్లెం బహూకరణ


వెండి సామగ్రిని అందజేస్తున్న దాతలు

యాదమరి: మండల కేంద్రంలో కొలువైన వరదరాజుల స్వామి ఆలయానికి ఎ.హరి బాబు(యూఎస్‌ఏ) అనే ప్రవాసభారతీయుడు వెండి పళ్లెంను బహూకరించాడు. శనివారం మండలంలోని సీఆర్ కండ్రిగకు చెందిన హరిబాబు తన తల్లి జ్ఞాపకార్థంగా రూ.75 వేలు విలువ చేసే వెండి పళ్లెంను ఆలయ కమిటీ సభ్యులు మండలి దేవరాజులు మొదలికి అందించాడు. ఈ సందర్భంగా దాత మాట్లాడుతూ ప్రతి సంవత్సరం తమ తల్లి జ్ఞాపకార్థంగా పలు సేవాకార్యక్రమాలు,అన్నదానం నిర్వహిస్తున్నామని తెలిపారు.అనంతరం మండలంలోని కొందరు పేదవారికి దుస్తులు, నిత్యావసర వస్తువులు అందజేశారు. కమిటీ సభ్యులు, ఆలయ ప్రధానార్చకులు పాల్గొన్నారు.

రామాలయంలో నేడు ప్రత్యేక పూజలు

బంగారుపాళెం: మండలంలోని మొగిలి వెంకటగిరి గ్రామంలో ఆదివారం శ్రీరామనవమి పర్వదినాన్ని పురస్కరించుకుని శ్రీకోదండరామస్వామి దేవాలయంలో ప్రత్యేక పూజలను నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఉదయం స్వామివారికి ప్రత్యేక అభిషేకాలు, పూజా కార్యక్రమాలతో పాటు ఉత్సవ మూర్తులను విశేషంగా అలంకరించి గ్రామోత్సవాన్ని చేపట్టనున్నట్లు తెలిపారు. రాత్రి ఆలయం ఆవరణలో హరికథ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు తెలిపారు. దైవ కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని సీతారామస్వామి కృపకు పాత్రులు కావాలని కోరారు.

పాలేరులో సీతారాముల కల్యాణోత్సవం

మండలంలోని పాలేరు కోదండరామ భజన మందిరంలో ఆదివారం శ్రీరామనవమి సందర్భంగా సీతారాముల కల్యాణోత్సవాన్ని నిర్వహించనున్నట్లు గ్రామస్తులు తెలిపారు. తొమ్మిది రోజుల పాటు హరికథా కాలక్షేపం చేపట్టినట్లు వివరించారు. 15వ తేదీ రాత్రి స్వామి రథోత్సవం ఉంటుందన్నారు. మండలంలోని రామాలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించనున్నారు.

దార్శనికుడు బాబూ జగ్జీవన్‌రామ్

- వాడవాడలా జయంతి
- చిత్రపటాల వద్ద ఘన నివాళి


వి.కోట ఎంపీడీఓ కార్యాలయంలో జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు


పెద్దపంజాణిలో నివాళి

పెద్దపంజాణి: బడుగు, బలహీన వర్గాల ఆశాజ్యోతి, దార్శనికుడు బాబూ జగ్జీవన్ రామ్ అని నేతలు కొనియాడారు. శనివారం ఆయన జయంతిని పురస్కరించుకుని స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఎంపీపీ ఎస్.రెడ్డెప్ప, ఏఓ భాస్కర్, ఈఓపీఆర్డీ శారదా దేవి, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

రొంపిచెర్లలో..

రొంపిచెర్ల: ఎంఆర్‌పీఎస్, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. స్థానిక ఆర్టీసీ బస్టాండ్‌లోని అంబేడ్కర్ విగ్రహం ఎదుట, పోలీస్‌స్టేషన్ ఎదుట చిత్రపటానికి నివాళుర్పించారు. విద్యావేత్త డాక్టర్ రఘునాథ, దళిత, బీసీ నేతలు నారాయణస్వామి, బండపల్లె సుభాష్, రమేష్, గిరిబాబు, చంద్ర, నరేష్, కృష్ణయ్య, రాజన్న, హరిప్రసాద్, రామాంజనేయులు, ఆవుల చంద్రయ్య పాల్గొన్నారు.

పుంగనూరులో..

పుంగనూరు: స్థానిక అంబేడ్కర్ సర్కిల్‌లో ఎంఆర్‌పీఎస్ నాయకులు నరసింహులు ఆధ్వర్యంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అలాగే రాయలసీమ చిల్డ్రన్స్ అకాడమీ డైరెక్టర్ చంద్రమోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో జయంతి వేడుకలు నిర్వహించారు. అద్దాల నాగరాజు, జేపీ నాగరాజు, నంది, కమ్మిరెడ్డి, నాగభూషణం, ప్రభాకర్, వెంకట్రమణ, హరిబాబు పాల్గొన్నారు.

సదుంలో..

సదుం: భట్టువారిపల్లె ఆర్‌డబ్ల్యూఎస్ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి అధికారులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఏఈఈ గౌతమి, ఏఈ ఆదినారాయణ, వేణుగోపాల్, సీనియర్ అసిస్టెంట్ జగదీశ్‌రెడ్డి, జూనియర్ అసిస్టెంట్ సుబ్రహ్మణ్యం, రాధమ్మ పాల్గొన్నారు.


వి.కోట సచివాలయంలో..


పలమనేరు మున్సిపల్ కార్యాలయంలో..

పలమనేరు: పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. మున్సిపల్ మేనేజర్ ఖాదర్ మొహిద్దీన్ జగ్జీవన్ రామ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళుర్పించారు. అదేవిధంగా పట్టణంలోని ఏరియా ఆస్పత్రిలో వైద్యులు, ఆస్పత్రి సలహా కమిటీ సభ్యులు ఘనంగా నిర్వహించారు. స్థానిక మాదిగ సంఘ నాయకులు పట్టణంలోని అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళర్పించారు.

కుప్పంలో..

కుప్పం: స్థానిక కడా కార్యాలయంలో జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి కడా పీడీ వికాస్ మర్మత్ పూలమాల వేసి నివాళులర్పించారు. అదేవిధంగా మున్సిపల్ కమిషనర్ కార్యాలయంలో మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసులు, కౌన్సలర్లు నివాళులర్పించారు.

వి.కోటలో..

వి.కోట: స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అదేవిధంగా స్థానిక సచివాలయం-1లో వి.కోట మేజర్ పంచాయతీ సర్పంచ్ పీఎస్ లక్ష్మి ఆధ్వర్యంలో నివాళులర్పించారు. ఎంపీడీఓ ఈశ్వరయ్య, ఈఓ శివశంకర్, వార్డు మెంబర్లు కుమార్‌రాజా, వేణుఆచారి పాల్గొన్నారు.

చౌడేపల్లెలో..

చౌడేపల్లె: స్థానిక ఎస్సీ బాలుర వసతిగృహంలో జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. వార్డెన్లు సురేష్, దీపారాణి, దళిత నేతలు బ్యాంకు రెడ్డెప్ప, డాక్టర్ చంద్ర, శేఖర్ పాల్గొన్నారు.


సదుంలో అధికారుల నివాళి


కడా కార్యాలయంలో..


చౌడేపల్లెలో..


రొంపిచెర్ల బస్టాండ్‌లో నేతల నివాళి


పోలీస్‌స్టేషన్ ఎదురుగా నివాళి


పుంగనూరులో దళిత నేతల నివాళి


పుంగనూరులో నివాళి